౧౩౨

# పాలగుమ్మి

"ఒక్క చలంగారు కాస్త రాశాడు మనుషుల గురించి. మన ఇప్పటి కథకులు నేలను విడిచి పదిగజాల ఎత్తునుండి రాస్తున్నారు. ఇంత మంది కథలను చదువుతాము కాని ఒక్కపాత్రకూడా మనసులో నిలవదు. భారతంలో చూడండి, ఒక్కొక్క పాత్ర ఎంత నిర్దిష్టంగా ప్రత్యేకంగా వుంటుందో......... దుష్ట పాత్రలయిన శల్యుడికీ శకునికీ మధ్యకూడా ఎంత తేడావుందో...." భారతంలో ఏ పద్యం తీసినా అది ఎవరన్నారో తెలుస్తుంది.... "అన్నారు శ్రీ పాలగుమ్మి పద్మరాజు ఢిల్లీలో "తెలుగు సాహితి' వారు ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ........

"అన్ని సాహిత్యాలకూ ఆదిరూపం పద్యం భారతంలో కథాలక్షణాలు. నాటకలక్షణాలు, 'లిరికల్" పొయెట్రీ' లక్షణాలు అన్నీ వున్నాయి. కాని ఇపుడు రాస్తున్నవారిలో చాలమందికి మన ప్రాచీన సాహిత్యంతో పరిచయంలేదు శ్రీనాథుడి "శివరాత్రి మహాత్మ్యం" చదివాను. అందులో గుణనిధి కథ వుంది. దానిలోని భక్తి. శివసాయుజ్యం వంటివి తీసివేస్తే ఆ.కథ 1300 సంవత్సరాల క్రింద జరిగివుండవచ్చు ; ఈనాడూ జరగవచ్చు ననిపిస్తుంది సోమర్సెట్ మామ్ నవల "ఆఫ్ హ్యూమన్ బాండేజ్" కథకూ గుణనిధి కథకూ చాలాపోలికలున్నాయి, కానిచిన్న కథ అన్నదానిని మనం పాశ్చాత్య దేశాలనుండి అరువు తెచ్చు కున్నాము.

"కథ ఎలా మొదలెట్టాలి, ఎలా రాయాలి అన్నది పిచ్చి ప్రశ్న. అది రాసేవాడికి తెలుసు కథ రాసేవాడికి కుతూహలం వుండాలి. రచనకు

పెద్ద స్టడీ కావాలి. రాగద్వేషాల కతీతుడయితేగాని, మంచి కథకుడు కాలేడు. నాటక రచనకూ అంతే.... ప్రతీ రెండో తెలుగువాడూ ఒక కవి అంటారు. ఇది కథకూ నవలకూ హానికరం. మన కథల్లో చాలా భాగం పద్యాలుగా రాస్తే రాణిస్తాయి. కాని కథలుగా కాదు.

"మన కథలో పాత్రలన్నీ "టైప్స్" క్రింద మూసపోస్తున్నారు. పేద వాళ్ళందరూ దేవుళ్ళు, అవతలి వాళ్ళందరూ రాక్షసులుగా చిత్రిస్తారు.

"మనిషికీ, జంతువుకూ భేదంవుంది. జంతువు స్మృతులు చాలా పరిమితం : ఆస్మృతుల ప్రయోజనం పరిమితం. మనిషి కొన్నియుగాల స్మృతివుంది వర్తమానంకంటే ఎక్కువగా మనిషి భూత. భవిష్యత్‌కాలాలలో నివసిస్తుంటాడు. గతమంతా తప్పు అన్నాడు మార్క్స్. నేటి విప్లవ రచయితలూ అదే అంటారు. కాని మనిషి, గతాన్ని మరవలేడు. గతంలేని మనిషిలో "ఎబెరేషన్" (విపరీత మానసిక స్థితి) ఏర్పడుతుందని, 1920 ప్రాంతంలో స్వీడన్‌లోని సాంఘిక పరిణామాలు తెలిపాయి. ప్రతి కమ్యూనిష్టు దేశంలోనూ "మారాజు .... మా చర్చి... మాశిల్పకళా సంపద" అంటూ గతంగురించి గర్వంగా చెపుతారు. పాత "ఆపేరా" లన్నింటిని పునరుద్ధరించి ప్రదర్శిస్తున్నారు.

"గతం తలచుకోవడంతో మన మనస్సుకొక "బాలెన్స్" వస్తుంది. పదిమందిలో బతకగల సత్తావస్తుంది.

"మానవాభ్యుదయానికి కారణం అసంతృప్తి. మార్క్స్‌కమ్యూనిష్టు మేనిఫెస్టో" వచ్చాక రకరకాల విప్లవాలు వచ్చాయి; ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఆప్రభుత్వాలమీద అసంతృప్తి పెరిగింది. ఒకప్పటి విప్లవకారుల మీద తాజా విప్లవాలు జరుగుతున్నాయి, నక్సలైటు గుండెల్లో కూడా లోకాన్ని మరమ్మతు చేయాలనే కాంక్ష తీవ్రంగా వుంది.... కాని విప్లవ భావాలతో ఎవరేమి రాసినా గొప్పకథ రాస్తే మంచిది. లేకపోతే చచ్చి

కథలు వస్తాయి" మహాభారతం చూడండి, టాల్‌స్టాయ్ రచనలు చూడండి. సిద్ధాంతాలున్నాయి వాటిలో కాని సిద్ధాంతాలకోసం మనుషుల్ని మార్చలేదు. సిద్ధాంత బద్ధులయిన రచయితలు మనుషుల్ని మార్చిపారేస్తున్నారు. "విరసం" కథల్లోకి రాలేదింకా...విప్లవ రచయితలను సానుభూతితో చూడాలి.", అన్నారు శ్రీ పద్మరాజు.

అంతకు ముందుగా శ్రీ పద్మరాజు గురించి ఆనాటి సభకు హాజరయిన శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి "చెబుతూ" "ప్రప్రథమ శ్రేణి కథా రచయితలలో, నవలలు వ్రాసేవారిలో బహు బహుకొద్ది మందిలో పద్మరాజు ముఖ్యుడు అని నా అభిప్రాయం, పద్మరాజు బాగా కవిత్వమూ చెప్ప గలడు. గేయాలు వ్రాయగలడు, తెలుసునా ? బాగా నాటకాలూ వ్రాస్తాడు; వ్రాసేడు అయితే కథా రచయితగా మరి ఎక్కువ దిట్ట" అన్నారు.

కృష్ణశాస్త్రిగారు ఇంకా ఇట్లాచెప్పారు. "ఒక మిత్రుడన్నాడూ" అలాగ అంటావుగాని నీవు వ్రాయలేవా. అమాత్రం కథా, నవలాను ; అని ... "అఘోరించాను" అని తక్షణం ఒక కథ. రియల్‌స్టోరి చెప్పాను.

"ఒకసారి దాదాపు 45 ఏళ్ళక్రింద నాకు ప్రాణాధికుడైన గుడిపాటి వెంకటచలం అంటే మీ చలం యింట్లో, మేడమీద, కొందరం మిత్రులం సమావేశం అయ్యాం. అందరమూ అప్పటికే సాహిత్య ప్రాంగణందాటి మందిరంలో అడుగుపెట్టిన వారమే, "చలం" సరేసరి తెనుగు నాటి ప్రతిభావంతులలో ప్రతిభావంతుడు. చింతా దీక్షితులు (అప్పుడు కథక చక్రవర్తిఅనేవారు) ముని మాణిక్యం, తెలికిచర్ల వెంకటరత్నం, కవికుల తిలకం వేదుల, నేను– ఇలాగ కొందరం.

చలం ఒక చిన్న "టైమ్‌పీస్" మధ్య పెట్టాడు. పెట్టి ఇలాగ అన్నాడు — నేను ఒక కథ మొదలు పెడతా. 5 నిముషాలు చెప్తా. చెప్పి నాతరువాత వానికి అప్ప జెప్తాను. అతనూ 5 నిముషాలు అంతే అలాగ చెప్పి

కుంటూ ఒక్కొక్కరికే అందించి కథ పూర్తిచెయ్యాలి" అన్నాడు. అని, తన ధోరణిలో ఘాటుగా కథ మొదలు పెట్టాడు ఎవరో కల్యాణీ శ్రీనివాస రావూ అంటూ పెట్టి!

దీక్షితులకు అందించాడు అతగాడు తన ధోరణిలో, ఘాటు తగ్గించి, సాధుత్వపు ధోరణిలో నడిపించాడు.

ముని మాణిక్యం తన ధోరణిలో-

అలాగే అందరూ వాళ్ళ వాళ్ళ గొంతుల్లో. నాకు మొగంలో రక్తం లేదు. నండూరి చెప్పినట్లు గుండె గొంతుకలోకి వచ్చి కూచుంది.

కంగారు పడుతూ అందుకున్నాను. అందుకుని-

"అప్పుడు సాయంకాలం అయింది. సూర్యుడు మబ్బుల వెనక జారిపోతున్నాడు. పశ్చిమాకాశ ప్రాంగణంలో ఎర్రని కుంకుమలు అర బోసి వున్నాయి, ఆలమందలు ఇళ్ళకు వచ్చేస్తున్నాయి" అంటూ 5 నిమిషాలు బలే సరదాగా వర్ణన చేసి "ఇక వేదుల" అన్నాను.

వేదుల గొప్పకవే. కాని కథ చెప్పడంలో నాకన్న చవట. కానిఅతి ధీమాగా కూర్చున్నాడు.

తక్షణం "అప్పుడు కల్యాణికీ శ్రీనివాసరావుకూ అతి వైభవంగా వివాహం జరిగింది" అన్నాడు, 10 సెకండ్లలో.

"అదేమిటి, నాన్సెన్స్" అన్నాం.

"నేనేం చెయ్యను, వాళ్ళకి పెళ్ళి అయి పోతే-" అన్నాడు.

"కవిలాగునే, కథకుడూ పుట్టుకతోనే కథకుడు" అంటూ ఆఘట్టం ముగించారు కృష్ణశాస్త్రి, [ 7, మే, 71 ]

---